

సుంకిశాల ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న జలమండలి ఎండీ


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

III | హైదరాబాద్, శుక్రవారం 25 ఏప్రిల్ 2025 | HYDERABAD




గాంధీ ఆస్పత్రిలో కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న టీఎన్జీవో నేతలు

## సుంకిశాల పనుల పరిశీలన

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) :సుంకిశాల ప్రాజెక్టు పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి బుధవారం పరిశీలించారు. పైప్ లైన్ విస్తరణ పనులు.. సుంకిశాల ఇంటేక్ వెల్ నిర్మాణ పనులపై ఆరా తీశారు. పైపు విస్తరణ పనుల్లో ప్రత్యేక దృష్టి సారించాలని ఏజెన్సీ అధికారులకు సూచించారు. నాణ్యతలో నిర్లక్ష్యం వహించ కూడదన్నారు. ప్రస్తుతం సివిల్, టన్నెల్, ఎలక్ట్రికల్, పైపు లైన్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.

## సీఎస్ఐఆర్ - ఏఎంపీఆర్ఐ డైరెక్టర్ గా ప్రొఫెసర్ భాస్కర్ గుప్తా



ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) – అడ్వాన్స్డ్ మెటీరియల్స్ అండ్ ప్రాసెసెస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ( ఏఎంపీఆర్ఐ) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ తల్లాడ భాస్కర్ గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# కొందరి పాపం.. అందరికీ శాపం

## లోప్రెషర్... హైటెన్షన్..!

- భూగర్భ జలాలు తగ్గడంతో నేరుగా నల్లాలకే మోటార్లు
- నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్న చుట్టుపక్కల జనం
- ఫిబ్రవరి-మార్చిలోనే దాదాపు రెట్టింపు స్థాయిలో ఫిర్యాదులు
- జరిమానాలతో కట్టడికి తంటాలు పడుతున్న జలమండలి
- మే నెలలో మరింత లోతుకు పడిపోనున్న భూగర్భ జలాలు



సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): మహా నగరంలోని నీటి సరఫరాలో లోప్రెషర్ కష్టాలు తీవ్రమవుతున్నాయి. మంది ఎక్కువైతే మజ్జిగ పలచనవుతుందన్నట్లు... నగరంలో రోజురోజుకీ భూగర్భజలాలు తగ్గిపోవడంతో జలమండలి నీళ్లకు డిమాండు మరింత పెరుగుతుంది. ఆ ప్రభావం చివరకు కొందరు వినియోగదారులు నేరుగా నల్లాలకే మోటార్లు పెట్టి నీళ్లు లాగేసేందుకు దారి తీస్తున్నది. దీంతో ఆ కొందరి పాపం... మిగిలిన అందరికీ శాపంగా మారుతున్నది. ఒక్క మోటారు చుట్టుపక్కల పదుల సంఖ్యలోని ఇండ్లల్లో లోప్రెషర్ కారణమవుతుంది. ఇలా... జలమండలి పరిధిలోని అనేక ప్రాంతాల్లో ఇబ్బడిముబ్బడిగా మోటార్లు పెడుతుండటంతో లోప్రెషర్ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది లోప్రెషర్ ఫిర్యాదుల అంతకంతకూ పెరుగుతుండటం జలమండలికి పెను సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో జరిమానాలతో కట్టడి చేసేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించి కార్యాచరణ మొదలుపెట్టారు. దీని ద్వారా ఫిర్యాదులు తక్కువై ఫలితాలనిస్తే ప్రజలకూ ఈ యాప్‌ను విస్తరించాలని యోచిస్తున్నారు. మరి... రానున్న మే నెలలో భూగర్భజలాల స్థాయి మరింత లోతునకు పడిపోనున్న దరిమిలా లోప్రెషర్ సమస్య తీవ్రమవుతుందా? జలమండలి కట్టడి ఫలితాలనిచ్చి తగ్గుముఖం పడుతుందా? అనేది కీలకంగా మారింది.

### ఉష్ణోగ్రతలు పెరగడంతో..

హైదరాబాద్ నగరంలో భూగర్భజలాలు గణనీయంగా పడిపోతున్నాయి. ఈ ఏడాది నెల ముందుగానే ఉష్ణోగ్రతలు పెరగడంతో నగరవ్యాప్తంగా భూగర్భజలాల నీటిమట్టం మరింత లోతునకు పడిపోయింది. హైదరాబాద్ జిల్లాలో గత ఏడాది మార్చిలో 9.75 మీటర్ల స్థాయిలో ఉన్న భూగర్భజలాలు ఇప్పుడు 10.10 మీటర్లకు పడిపోయాయి. మేడ్చల్ జిల్లాలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇక్కడ గత ఏడాది మార్చిలో 12.45 మీటర్లలోతున్న ఉంటే ఇప్పుడు ఏకంగా 14.60 మీటర్ల లోతుల్లోకి పోతేగానీ భూగర్భజలాలు అందేలాలేవు. రంగారెడ్డిలోనూ ఇప్పుడు 12.59 మీటర్ల లోతున జలాలు అందుబాటులో ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. ముఖ్యంగా వెస్ట్ జోన్ పరిధిలో రెండు నెలల కిందటే బోర్లు ఎండిపోవడంతో జనం ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. గత ఏడాది కంటే ఈసారి జలమండలి ట్యాంకర్లు రెట్టింపు స్థాయిలో ఏర్పాటు చేసినా డిమాండు తీరడం లేదు. ఈ నేపథ్యంలో ప్రైవేటు నీటి వ్యాపారం కూడా జోరందుకుంటున్నది. అయితే భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతుండటం జలమండలి నీటి సరఫరాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. బోర్లు ఎండిపోయిన చోట ట్యాంకర్ నీటిని తెచ్చుకోలేక... జలమండలి నీటి సరఫరా జరుగుతున్న సమయంలో నేరుగా నల్లాలకే మోటార్లు బిగిస్తున్నారు. సాధారణంగా గృహాల్లో అర అంగుళం మోటార్లు ఎక్కువగా వినియోగిస్తారు. కానీ కొన్నిచోట్ల ఏకంగా రెండు అంగుళాల మోటార్లు పెట్టి మరీ నల్లా నీటిని నేరుగా గుంజుతున్నారు. ఇలా కొందరు చేయడంతో చుట్టుపక్కల ఉన్న గృహాలు లోప్రెషర్‌తో ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరికి అసలు నీటి సరఫరానే నిలిచిపోతున్నది. దీంతో జలమండలికి ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. 2022 నుంచి పరిశీలిస్తే ఫిబ్రవరి, మార్చి నెలల్లో నెలకు 1000–1500 వరకు ఉండే లోప్రెషర్ ఫిర్యాదులు ఈ ఏడాది ఫిబ్రవరిలో 2800కు పైగా నమోదు కాగా... మార్చి నెలకొచ్చే సరికి దాదాపు రెట్టింపుస్థాయిలోకి పెరిగి నాలుగు వేల మైలురాయిని దాటడమంటే క్షేత్రస్థాయిలో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నది.

### వచ్చే నెల గడిచేదెలా?

మే నెలలో కచ్చితంగా భూగర్భజలాల స్థాయి మరింత లోతునకు పడిపోవడమనేది సాధారణమే. కేవలం జలమండలి నీటిపైనే ఆధారపడే కుటుంబాల సంఖ్య మరింత పెరగనున్నది. వీళ్లు కూడా నీటి కోసం నల్లాలకు మోటార్లను అమర్చే ప్రయత్నాలు చేస్తే లోప్రెషర్ సమస్య జఠిలం కానున్నది. ఇప్పుడు జలమండలికి లోప్రెషర్ సమస్య అనేది హైటెన్షన్ రేపుతున్నది. అయితే అధికారులు యాప్‌తో క్షేత్రస్థాయిలోకి వెళ్లి కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నారు. 700కు పైగా కేసులు నమోదయ్యాయి. భూగర్భజలాలు మరింత లోతునకు పడిపోయి ఎండిపోయిన బోర్ల సంఖ్య పెరుగుతుంది. అప్పుడు కొందరు జలమండలి నీటినే మోటార్లతో గుంజే పరిస్థితి ఎక్కువయ్యే ప్రమాదముంది. అయితే జలమండలి అధికారులు తీసుకుంటున్న చర్యలతో మోటార్లు పెట్టేందుకు వినియోగదారులు జంకుతారా? అనేది ఈ నెల ముగిసేనాటికి నమోదయ్యే లోప్రెషర్ ఫిర్యాదుల సంఖ్యతో తేలనుంది. ఒకవేళ ఇది సత్ఫలితాన్నిస్తే కీలకమైన మే నెలలో లోప్రెషర్ సమస్యను నియంత్రించేందుకు ప్రజల చేతికి కూడా యాప్‌ను ఇచ్చి నల్లాలకు నేరుగా మోటార్లు పెట్టకుండా కట్టడి చేయాలని యోచిస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు.



**లోప్రెషర్ ఫిర్యాదుల తీరు ఇలా...**

| సంవత్సరం | ఫిబ్రవరి | మార్చి |
|---|---|---|
| 2022 | 984 | 1759 |
| 2023 | 1357 | 1468 |
| 2024 | 2212 | 2874 |
| 2025 | 2833 | 4035 |

**మహా నగరంలో మార్చి నెల నివేదిక ప్రకారం భూగర్భ జలాల స్థాయి ఇది... (మీటర్ల లోతు)**

| జిల్లా | మార్చి-2024 | మార్చి-2025 |
|---|---|---|
| హైదరాబాద్ | 9.75 | 10.10 |
| మేడ్చల్ | 12.45 | 14.60 |
| రంగారెడ్డి | 12.57 | 12.59 |

## ఉద్యమ స్ఫూర్తి చలో ఎల్కతుర్తి

మేడ్చల్, ఏప్రిల్24(నమస్తే తెలంగాణ): ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ సభకు తరలివచ్చేందుకు ప్రజలు ముందుకు వస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. రజతోత్సవ సభకు తరలించేలా నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శ్రేణులు, నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నారు. 'బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వచ్చేందుకు ప్రజలు ఉత్సాహం చూపిస్తున్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో భారీ సంఖ్యలో రజతోత్సవ సభకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం'. అని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. 'కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో ఉత్సాహంగా పాల్గొని రజతోత్సవ సభకు తరలివస్తామని చెబుతున్నారు' అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు.



మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం చెట్టు కింద కుర్చీ వేసుకుని ప్రజల సమస్యలను వింటూ పరిష్కరించమని అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేస్తున్న ఎమ్మెల్యే మర్రి

## ప్రజల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, ఏప్రిల్ 24: ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి రెండో రోజు చెట్టు కింద కూర్చొని ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లేకపోవడంతో చెట్టు కింద కూర్చుని ప్రజా సమస్యలు తెలుసుకుంటూ సంబంధిత అధికారులకు తెలియజేస్తూ వినూత్నంగా రెండో రోజు నిరసన వ్యక్తం చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీతా యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నేత వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల పరిరక్షణలో అదే నిర్లక్ష్యం

- హైకోర్టు అక్షింతలు వేసినా.. మారని జీహెచ్ఎంసీ అధికారుల పనితీరు
- బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సుందరీకరణ పనులు నిలిపివేసిన వైనం
- గుర్రపు డెక్క, మురికి కూపం, కబ్జాలపై స్థానికుల ఫిర్యాదులు



సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ ): చెరువుల పరిరక్షణలో జీహెచ్ఎంసీ అధికారుల వైఖరి మారడం లేదు..చివరకు హైకోర్టు అక్షింతలు వేసిన పనితీరులో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఫలితంగా చెరువుల ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీటితో దుర్గంధానికి తోడు దోమల బెడద స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. వాస్తవంగా రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలో 13 చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, పరిరక్షణ విషయంలో జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోవడం లేదన్న 'గమన' స్వచ్ఛంద సంస్థ ఈడీ దయాకర్ పిటిషన్‌పై సమగ్ర విచారణ చేపట్టిన న్యాయస్థానం జీహెచ్ఎంసీకి మొట్టికాయ వేస్తూనే 13 చెరువుల దయనీయస్థితిపై ఇద్దరు కోర్టు కమిషనర్ల కమిటీ నియమించి విచారణ జరిపించింది. న్యాయవాదులు ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి సభ్యులుగా నియమితులైన ఈ కమిటీ.. జీహెచ్ఎంసీ అధికారులు, హైదరాబాద్ , రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు చెరువుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటన్నది పరిశీలించింది. జంట జిల్లాల్లోని 13 చెరువులను పరిశీలించి తమ నివేదికను ఇటీవల హైకోర్టుకు సమర్పించింది. రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్లే చెరువులు ఆక్రమణకు గురయ్యాయని హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఈ చెరువుల కాలుష్యం కేవలం పర్యావరణానికి మాత్రమే కాకుండా.. ప్రజా ఆరోగ్యానికి కూడా తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశాలున్నాయని తెలిపింది. ఆక్రమణలు, కాలుష్యం కారణంగా చెరువులపై ఆధారపడిన పక్షులు, జంతుజాలం, జలచరాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇందులో భాగంగానే హస్మత్‌పేట బోయిని చెరువు, చందానగర్ గంగారం చెరువు, దుండిగల్ చిన్న దామెర చెరువు, మద్దెలకుంట చెరువు బైరామల్ గూడ, నల్లగండ్ల చెరువు, పెద్ద చెరువు పీర్జాదిగూడ, అంబీర్ చెరువు కూకట్‌పల్లి, చిన్నరాయుని చెరువు అల్వాల్, దుర్గం చెరువు, ఉప్పల్ నల్ల చెరువు, సున్నంచెరువుల పరిరక్షణపై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉన్నప్పటికీ నెలల తరబడి పరిరక్షణలో జాప్యం చేస్తుండడం గమనార్హం.

### స్టాండింగ్ కమిటీ ఆమోదించేనా?

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆయా 13 చెరువుల పరిరక్షణలో .. టెక్నికల్ కన్సల్టెంట్‌గా నీరి (జాతీయ పర్యావరణ, ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ)ని నియమించుకుని చెరువుల నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షలు జరపడంతో పాటు ఇరిగేషన్ సమన్వయంతో సంబంధిత చెరువుల ఆక్రమణకు గురి కాకుండా పక్కాగా పరిరక్షణ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందు కోసం రూ. 55 లక్షల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఎంఐఎం సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 13 చెరువులతో పాటు అదనంగా కొన్ని చెరువులను చేర్చాలని పట్టుపట్టారు. ఈ సమయంలో మేయర్‌కు, ఎంఐఎం సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. చివరకు ఈ ప్రతిపాదనను కమిటీ పక్కన పెట్టింది.

## ఏటీఎం యంత్రానికి టేపేసి.. డబ్బు కాజేసి..





వెంగళరావునగర్, ఏప్రిల్ 24 : ఏటీఎం యంత్రంలో సరికొత్త మోసం వెలుగుచూసింది. కస్టమర్లు డ్రా చేసే డబ్బు బయటకు రాకుండా ప్యానల్ యాక్సెస్ లో ఇరుక్కునేలా టేప్ అంటించి.. కస్టమర్లు బయటికి వెళ్లాక నకిలీ కీస్ తో యాక్సెస్ మిషన్ తెరిచి అందులోని డబ్బును దొంగ చోరీ చేసి ఉడాయించాడు. కస్టమర్లు ఏటీఎం నుంచి లావాదేవీలు ప్రాసెస్ జరిగినట్లు మెసేజులు వచ్చినప్పటికీ.. ఖాతాదారులకు ఏటీఎం నుంచి డబ్బు రాలేదు. ఈనెల 16న ఓ కస్టమర్ తనకు జరిగిన మోసంపై అంబుడ్స్మన్‌కు ఫిర్యాదు చేయడంతో బ్యాంక్ అధికారుల దృష్టికి వచ్చింది. యూనియన్ బ్యాంక్ డిప్యూటీ బ్రాంచ్ హెడ్ బి.ప్రదీప్ దినకర్ రాజు ఎస్.ఆర్.నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏటీఎం సీసీ ఫుటేజ్ ను ఎస్.ఆర్.నగర్ పోలీసులు సేకరించి పరిశీలించగా..నగదు పంపిణీ స్లాట్ లో టేప్ అంటించి డబ్బు బయటకు రాకుండా అడ్డుకున్నట్లు వెల్లడైంది. మారుతాళం చెవులతో ఏటీఎం పానల్ యాక్సెస్ ను తెరిచి అక్కడ చిక్కుకుని ఇరుక్కుపోయిన డబ్బు కాజేసి మోసం చేసినట్లు తేలింది. ముందస్తు పథకంతో పదేపదే ఏటీఎంలోకి జొరబడి సుమారు రూ.45 వేలు అపహరించుకెళ్లినట్లు వెల్లడైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


### 36గంటల్లో వర్ష సూచన

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల 36 గంటల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు, మరి కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారి వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గురువారం గ్రేటర్‌లో గరిష్ఠం 39.1, కనిష్ఠం 27.7 డిగ్రీలు, గాలిలో తేమ 32శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

## హెచ్‌సీయూ భూముల్లో సుప్రీం ఆదేశాలు ఉల్లంఘన

### మష్రూమ్ రాక్స్ పక్కన పెద్ద స్తంభం ఏర్పాటు

సిటీ బ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో కాంగ్రెస్ సర్కార్ సుప్రీం కోర్టు ఆదేశాలను ఉల్లంఘించింది. 400 ఎకరాల భూవివాదంపై తుది తీర్పు వెలువడేదాకా అక్కడ ఎలాంటి కార్యకలాపాలకు పాల్పడొద్దని సుప్రీం కోర్టు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కానీ.. సుప్రీం ఆదేశాలను బేఖాతరు చేస్తూ వివాదాస్పద 400 ఎకరాల్లో ఉన్న మష్రూమ్ రాక్స్ పక్కన అధికారులు ఓ పొడవాటి స్తంభాన్ని ఏర్పాటు చేశారు. భూవివాదంపై తుది తీర్పు వచ్చేదాకా అన్ని పనులు నిలిపేయాలని స్పష్టమైన ఆదేశాలున్నా ప్రభుత్వం స్తంభం పెట్టడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





# నిలోఫర్‌లో అదుపు తప్పిన పాలన

- రెచ్చిపోతున్న కిందిస్థాయి ఉద్యోగులు
- ఖరీదైన మందులు తస్కరించి..అవసరమైన రోగులకు విక్రయం
- ఓ మహిళా ఉద్యోగి నిర్వాకం
- నాంపల్లి పోలీసులకు అధికారుల ఫిర్యాదు

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): నిలోఫర్ దవాఖానలో పాలన గాడి తప్పింది. అధికారుల పర్యవేక్షణ లోపంతో కిందిస్థాయి ఉద్యోగులు రెచ్చిపోతున్నారు. బ్లడ్ బ్యాంక్‌లో నుంచి బ్లడ్ ప్యాకెట్లు మాయమైన ఉదంతంపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక రాకముందే తాజాగా మందుల చోరీ వెలుగులోకి రావడం గమనార్హం. దవాఖాన వర్గాలు, విశ్వసనీయంగా అందిన సమాచారం ప్రకారం...నిలోఫర్ దవాఖానలో ఓ మహిళ తన తండ్రి మరణించడంతో కారుణ్య నియామకం కింద ఉద్యోగంలో చేరి, లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నది. దవాఖానలోని మరికొందరు ఉద్యోగుల సహకారంతో ఖరీదైన మందులు, ఇంజక్షన్లు, ఇతర క్లినికల్ సామగ్రి వంటి వాటిని తస్కరించి సంచుల్లో భద్రపరుస్తుంది. ఆయా మందుల కొరత ఏర్పడటంతో దవాఖాన సిబ్బంది వైద్యులు రాసిన మందులను బయట నుంచి తెచ్చుకోవాలని సూచిస్తారు. అప్పటికప్పుడు ఆ మందులు ఎక్కడ దొరుకుతాయో వాకబు చేసే లోపే విషయాన్ని గమనించి, తాను తెప్పించి ఇస్తానంటూ రోగి సహాయకుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి తస్కరించిన మందులను వారికి అందజేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.



### బ్లడ్ బ్యాంక్ వ్యవహారం..

చిన్నారులు, గర్భవతులకు అత్యవసర సమయంలో అందించాల్సిన రక్తాన్ని అర్ధరాత్రి సమయంలో దవాఖానలోని బ్లడ్ బ్యాంక్ నుంచి బయటకు దాటించిన ఘటన వ్యవహారం మరవకముందే మందుల భాగోతం బయటకు రావడం కలకలం రేపింది. సాధారణంగా మందులకు


మిగతా IV లో


# ఆర్థికంగా ఆదుకోకపోతే చార్జీలు పెంచాల్సిందే



**మెట్రో చార్జీల పెంపుపై ఎల్‌ఆండ్‌టీ ప్రతిపాదనలు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 24(నమస్తే తెలంగాణ): ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కసరత్తు మొదలుపెట్టింది. ప్రయాణికుల రద్దీ పెరిగిన నష్టాలు తగ్గకపోవడం, కమర్షియల్ స్పేస్ రెవెన్యూ లేకపోవడంతో చార్జీలు పెంచడమే అనివార్యం అన్నట్లుగా వ్యవహరించింది. కానీ రెవెన్యూ పెంచుకునే అంశాలపై దృష్టి పెట్టకపోవడంతో ఇప్పుడు ఆ భారాన్ని భర్తీ చేసుకునేందుకు చార్జీలు పెంచాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరనున్నది.

### రెండు ప్రతిపాదనలు...

ఎల్ అండ్ టీ సంస్థకు గతేడాది 9 నెలల వ్యవధిలో రూ. 393 కోట్ల నష్టం వచ్చినట్లు తెలిసింది. 2021 నుంచి 2024 వరకు రూ. 6వేల కోట్ల నష్టం వచ్చింద. అయితే గడిచిన నాలుగేండ్లుగా నష్టాల భారం క్రమంగా తగ్గుతున్నట్లు గణాంకాలు చెబుతుండగా... చార్జీల పెంపు కోసం ప్రభుత్వానికి రెండు ప్రతిపాదనలు చేయనున్నట్లు తెలిసింది. ఇందులో 20–30 శాతం చార్జీల పెంపు, లేదా వయబులిటీ గ్యాప్ ఫండ్ రూపంలో నిధులు సర్దుబాటు చేస్తే, ఇప్పటివరకు వచ్చిన నష్టాలను భర్తీ చేసుకోవచ్చనే ఎల్ అండ్ టీ మెట్రో భావిస్తోంది.